క్లుప్తంగా

నేడు ఇంటర్వ్యూలు

వెల్దండ: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న మైనార్టీల లబ్ధిదారులకు ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ప్రభుత్వం మైనార్టీ కార్పొరేషన్ కింద మూడు యూనిట్లను మంజూరు చేసిందన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మైనార్టీలు 59 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. లబ్ధిదారులందరు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు సకాలంలో హాజరుకావాలన్నారు.

ఎంపీ వ్యాఖ్యలు సరికావు

అచ్చంపేట రూరల్: లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.బీక్యానాయక్ డిమాండ్ చేశారు. గురువారం అచ్చంపేటలో గిరిజన ఉద్యోగుల సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గిరిజన తెగల మధ్య చిచ్చుపెట్టి రాజకీయంగా లబ్ధిపొందాలని చూడటం దుర్మార్గమైన చర్య అన్నారు. జైపాల్‌నాయక్, రాములునాయక్, ఘన్సీరాం, దశరథ్ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ పంపిణీ

కల్వకుర్తి రూరల్: ఇటీవల గుండెపోటుతో తండ్రి మృతిచెందగా ఉండడానికి నివాసం లేని నిరుపేద ముస్లిం మహిళకు ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నాయకులు సురేందర్‌రెడ్డి గురువారం మండలంలోని తాండ్రలో కుట్టుమిషన్‌ను అందజేశారు. సురేందర్‌రెడ్డి, బాలకృష్ణ, అశోక్, విజయ్, కిష్టయ్య, పర్వతాలు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



అచ్చంపేట రూరల్: భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతిని గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

చారకొండ: రాష్ట్ర ప్రభుత్వం రైతులు సాగుచేసే పంటలకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించాలని రైతు హక్కుల సాధన సమితి కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్ జూపల్లి రాములు యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరులతో మట్లాడారు. రైతులు సాగు చేసిన పంటలో ఇప్పటికే పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లిందని అన్నారు.

అడవి అభివృద్ధికి సహకరించండి

దోమలపెంట: అడవి అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధుల సహకారం అందించాలని దోమలపెంట ఎఫ్ఆర్ఓ గురుప్రసాద్ అన్నారు. హైదరాబాద్ నుంచి బదిలీపై దోమలపెంట ఎఫ్ఆర్ఓగా వచ్చిన ఆయన్ను గురువారం స్థానిక ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తిమ్మన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

వెల్దండ: మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లను గురువారం కల్వకుర్తి ఆర్డీఓ శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి బూత్‌లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. మండల కేంద్రం 152వ పోలింగ్ బూత్ స్థానిక గ్రంథాలయంలో ఉండటంతో అక్కడ భవనం శిథిలావస్థలో ఉండటంతో పక్కనే ఉన్న బాలికల ఉన్నత పాఠశాలకు మార్చాలని సూచించారు. మండలంలో పోలింగ్ బూత్‌ల్లో దివ్యాంగుల సౌకర్యం కోసం ర్యాంపులు, విద్యుత్ సౌకర్యం, మూత్రశాలలు, తాగునీటి వసతి తదితర విషయాలని సక్రమంగా ఉండేలా చూడాలని ఆర్డీఓ అధికారులకు తెలియజేశారు.

విద్యార్థులకు అవగాహన

బల్మూర్: విద్యార్థులు సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్‌పై అప్రమత్తంగా ఉంటూ వారిని పోలీసులకు పట్టించాలని తెలిపారు.

బాల్యవివాహాలు చేస్తే చర్యలు

అచ్చంపేట రూరల్: బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని సీఐ అనుదీప్ హెచ్చరించారు. గురువారం కోనేరు సంస్థ కేఎస్‌సీఎఫ్ ప్రాజెక్టు ప్రతినిధులు సీఐ అనుదీప్, ఎస్‌ఐ గోవర్ధన్‌ను కలిశారు. ప్రాజెక్టు నుంచి చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. ప్రజలకు బాల్య వివాహాలు, బాల కార్మికులు, ఇతర విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. రోజలీల, రాణి పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జూపల్లిలో ఇళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

కందనూలు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ జయంత్ కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ప్రజలు వర్షాలతో ఏదైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి(9000083630), హెల్త్ అసిస్టెంట్ గణేష్(9160709767)లను సంప్రదించాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లవద్దని, వర్షం పడుతున్న సమయంలో చెట్ల కింద ఉండవద్దని సూచించారు. పాత ఇళ్లు, గుడిసెల్లోని ప్రజలు అక్కడ ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. పాత ఇళ్లు కూలిపోయే పరిస్థితిలో ఉంటే, ఏమైనా సమస్యలు తలెత్తితే మున్సిపల్ అధికారులు, టోల్ ఫ్రీ నంబర్లను సంప్రదించాలని వివరించారు.

సురక్షిత నివాసాలకు తరలాలి..

చారకొండ: ఇటీవల ఎడతెరిపి లేకుండా వానలు రావడంలో గ్రామాల్లో మట్టి ఇళ్లు, రేకుల నివాసాల్లో ఉండే వారు గ్రామంలో ఇతర సురక్షిత నివాసాలు, గ్రామపంచాయతీ సంబంధిత కార్యాలయం, ప్రభుత్వ భవనాలకు వెళ్లాలని ఆర్‌ఐ నభి సూచించారు. మండలంలోని జూపల్లిలో గురువారం ఆర్‌ఐ నభి గ్రామంలో పర్యటించి వానలకు దెబ్బతిన్న ఇళ్లను గుర్తించారు.

నిండిన చెరువులు..

కొల్లాపూర్: కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. పలు చెరువులు అలుగులు పారుతున్నాయి. వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాగులు, చెరువుల అలుగుల వద్ద వలలతో స్థానికులు చేపలు పడుతున్నారు.

అలుగు పారుతున్న బొల్లంపల్లి చెరువు..

వెల్దండ: మండల పరిధిలోని బొల్లంపల్లిలోని పెద్ద చెరువు గురువారం అలుగు పారుతుంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు బొల్లంపల్లి చెరువుకు ఎగువ నుంచి వచ్చి నీరు చేరింది. చెరువు అలుగు పారడంతో రైతులు, మత్స్యకారులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఈదురు గాలులకు కూలిన చెట్టు..

మన్ననూర్: ఈదురు గాలులకు శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి బోరెడ్డిపల్లిబావి అటవీ సరిహద్దు ప్రాంతంలో గురువారం చెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడటంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. సమాచారం తెలుసుకుని అటవీశాఖ క్షేత్ర అధికారి ఈశ్వర్ చెట్టును డోజర్ సాయంతో పక్కకు తొలగించారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం



ఎమ్మెల్యేకు వినతి అందజేస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లు

కొల్లాపూర్: మున్సిపాలిటీని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీలోని పలు వార్డులకు చెందిన పార్టీ నాయకులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ఆయా వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఇటీవల మున్సిపాలిటీకి మంజూరైన నిధులతో పెండింగ్‌లోని పనులన్నింటినీ పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల విషయంలో రాజీ పడేది లేదన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మితో పాటు కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఫొటోగ్రాఫర్ల వినతి..

నియోజకవర్గ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు గురువారం ఎమ్మెల్యేని కలిశారు. ఫొటో, వీడియోగ్రాఫర్ల సమస్యలను వివరించారు. అసోసియేషన్ భవనానికి స్థలం కేటాయించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. మైనొద్దీన్, షాబుద్దీన్, హఫీజ్, పీరా, భాస్కర్ తదితరులున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ..

కొల్లాపూర్ మండలం జవాయిపల్లికి చెందిన ఎల్లమ్మకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.1.50లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును లబ్ధిదారురాలికి ఎమ్మెల్యే అందజేశారు.

గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటాలి



ఆకునెల్లికుదురులో ప్రకృతివనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పెద్దకొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో మొక్కలు నాటాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. గురువారం పెద్దకార్పాములలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రోడ్లకు ఇరువైపుల ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు సిద్ధం చేయాలి..

తాడూరు: కురుస్తున్న వర్షాల కారణంగా తెలంగాణకు హరితహారంలో భాగంగా నాటేందుకు నర్సరీల్లోని మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ గంగమోహన్ సూచించారు. గురువారం మండలంలోని ఆకునెల్లికుదురులోని పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. గ్రామసభలో తెలంగాణకు హరితహారం కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రజలకు అవసరమైన మొక్కలు అందజేయాలన్నారు.

క్రీడా ప్రాంగణాలను పూర్తిచేయాలి..

చారకొండ: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులు ఆడుకునేందుకు ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం క్రీడా ప్రాంగణాలను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. గరువారం మండలంలోని జూపల్లి, సారంబండ తండా, తుర్కలపల్లిలో హరితహారం ఎవెన్యూ ప్లాంటేషన్ పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల్లో, ప్రధాన రహదారులకు ఇరువైపుల ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని సూచించారు. వారివెంట ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు మల్లేష్, వినోద్, సైదులు ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌పీ పోస్టులను గిరిజనులకే ఇవ్వాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజన సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్‌పీ, ఏఎన్ఎం పోస్టులను గిరిజన అభ్యర్థులకే ఇవ్వాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు దేశ్యనాయక్, జిల్లా కార్యదర్శి శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి మాట్లాడారు. రాష్ట్రంలోని ఆసీఫాబాద్, ఆదిలాబాద్ ఐటీడీఏ ప్రాంతాల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లో సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆయా పాఠశాలల్లో భర్తీకాని 50 శాతం పోస్టులను గిరిజన అభ్యర్థులకే కేటాయిస్తూ.. మైదాన పాఠశాల్లోని ఆశ్రమ పాఠశాలల్లోని ఖాళీలను 50 శాతం సీట్లకు కేటాయిస్తూ ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. నాగరాజు, గణేష్, భీమ్లా, హరిబాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

కోడేరు: మండల కేంద్రంలోని ఊరగుట్ట సమీపంలో కోడేరు, పస్పుల వెళ్లే దారిలో వర్షానికి మట్టి రోడ్డు బురదమయంగా మారడంతో గ్రామస్తులు బుధవారం రోడ్డుపై నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కథనం 'సాక్షి'లో ప్రచురితం కావడంతో అధికారులు, సర్పంచ్ వెంకటస్వామి, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రవితేజ, శ్రీశైలం వెంటనే గురువారం స్పందించారు. రోడ్డుపై మట్టి వేసి బాగు చేశారు.

పంటల సస్యరక్షణపై రైతులకు అవగాహన



సమావేశంలో ఏడీఏ వెంకటేశ్వర్లు

బల్మూర్: ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలతో తెగుళ్ల బారి నుంచి పంటలను కాపడుకోవడానికి రైతులు సస్యరక్షణపై చర్యలు పాటించి అప్రమత్తంగా ఉండాలని వ్యసాయాధికారి మహేష్‌కుమార సూచించారు. గురువారం మండలంలోని తుమ్మెన్‌పేట రైతువేదిక భవనంలో పంటల సస్యరక్షణపై రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు.

డ్రమ్‌సీడర్‌పై అవగాహన..

తాడూరు: అధునాతన వ్యవసాయ పద్ధతులపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని చర్లఇటిక్యాలలో డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ మాట్లాడారు. డ్రమ్‌సీడర్ పద్ధతిలో వరిసాగు, రైతు బీమా దరఖాస్తుకు చేసుకోవాల్సిన వివరాలు, పంటల నమోదు, పండ్ల తోటలపై ఇచ్చే సబ్సిడీ తదితర విషయాలపై వివరించారు. సమావేవంలో శాస్త్రవేత్తలు డాక్టర్ శైల, వ్యవసాయాధికారి సాయిరమేశ్‌కుమార్, ఏడీఏ రమేశ్‌బాబు, కమల్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ మృతికి సంతాపం



నాగశేషి (ఫైల్)

కొల్లాపూర్: మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మేకల నాగశేషి(59) అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నారు. రెండు రోజుల కిందట ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మహబూబ్‌నగర్‌కు తరలించి చికిత్సలు చేయిస్తున్నారు. గురువారం ఉదయం ఆయన అక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని కొల్లాపూర్ తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. పట్టణానికి చెందిన నాగశేషి సుదీర్ఘ కాలం వివిధ హోదాల్లో కొల్లాపూర్ గ్రామపంచాయతీ, మున్సిపాలిటీల్లో విధులు నిర్వహించారు. నాగశేషి మృతదేహానికి ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ, కౌన్సిలర్లు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మాజీ మంత్రి జూపల్లి అనుచరులు, మున్సిపల్ ఉద్యోగులు, యాదవ సంఘాల నాయకులు నివాళి అర్పించారు.

గౌడ సంఘం కమిటీ ఎన్నిక

వెల్దండ: మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో గురువారం మండల గౌడ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన గౌడ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మట్ట ఆంజనేయులుగౌడ్, ఉపాధ్యక్షుడిగా శ్రీనుగౌడ్, యూత్ అధ్యక్షుడిగా శివగౌడ్, ఉపాధ్యక్షుడిగా నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీశైలంగౌడ్, కోశాధికారి రవిగౌడ్ తదితరులను ఎన్నుకున్నారు.

ఘన సన్మానం..

కల్వకుర్తి రూరల్: కల్వకుర్తి మున్సిపాలిటీ గౌడ యువజన సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన నరేష్‌గౌడ్‌ను గురువారం బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ మాట్లాడారు. దుర్గాప్రసాద్, నర్సింహ, వివేకానంద, రవిగౌడ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుబంధు పేరుతో మోసం'



నాగర్‌కర్నూల్‌లో మాట్లాడుతున్న మణెమ్మ

కందనూలు: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం, రైతుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలపై వ్యవసాయ అధికారులు, విత్తన దుకాణదారులు రైతులను చైతన్యం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కొండ మణెమ్మ కోరారు. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ ద్వారా ప్రారంభించిన వివిధ పథకాలు ప్రారంభం, వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దేశంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతులను, రాజులుగా మార్చేందుకు యూరియాపై రూ.2236, డీఏపీపై రూ.2,422 సబ్సిడీలు ఇచ్చారని, ఈ విషయంలో ప్రజలను చైతన్యం చేయాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులు, విత్తన కేంద్రాల యాజమాన్యులపై ఉందన్నారు. రాష్ట్రంలోని కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో రూ.5 వేలు చెల్లించి, రైతులకు అందాల్సిన కేంద్ర ప్రభుత్వ నిధులను అందించకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. కొండా నగేష్, పట్టణ అధ్యక్షుడు రాము, సైదులు, ప్రధాన కార్యదర్శి ప్రమోద్, బాల మల్లయ్య, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం తెలకపల్లి ఆధ్వర్యంలో రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. రమణారెడ్డి, నరేంద్రాచారి, బాబుసాగర్ పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: రైతులు ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాల్లో ఎరువులు కొనుగోలు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు భీమేష్ అన్నారు. మండల కేంద్రంలో మన గ్రోమోర్, ఇస్కో కేంద్రాల వద్ద ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను ప్రారంభించారు. ప్రధానమంత్రి ప్రసంగాన్ని రైతులకు వినిపించారు. శివుడు, రాజు, తిరుమల్, సుధాకర్‌రావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్ సమృద్ధి యోజనపై అవగాహన..

కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కిసాన్ సమృద్ధి యోజన పథకంపై మండల వ్యవసాయ అధికారి నాగరాజుతో పాటు బీజేపీ నాయకులు రైతులకు అవగాహన కల్పించారు. శేఖర్‌గౌడ్, సాయికృష్ణగౌడ్ తదితరులున్నారు.

ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపిద్దాం



అచ్చంపేటలో ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న అధికారులు

కొల్లాపూర్: ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కార్మికులు కృషి చేయాలని ఆర్టీసీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రీజనల్ మేనేజర్ శ్రీదేవి సూచించారు. గురువారం ఆమె కొల్లాపూర్ డిపోను సందర్శించారు. ఆర్టీసీ ఇస్తున్న రాయితీ పథకాలు టీ9–60, టీ9–30 టికెట్ల గూర్చి ప్రయాణికులకు తెలియజేయడంతో పాటు, వివిధ అంశాల్లో మెరుగైన ప్రతిభ కనబర్చిన కార్మికులకు ఆమె ప్రశంసాపత్రాలు అందజేశారు. డీఎం రాజేశ్వర్, ఎస్‌టీఐ శంకర్‌నాయక్, ఏఎంఎఫ్ రంజిత్ తదితరులున్నారు.

ప్రజల చెంతకే ఆర్టీసీ..

అచ్చంపేట రూరల్: గ్రామీణ, పట్టణ ప్రయాణికులకు ఆర్థిక భారం తగ్గించడానికే టీఎస్ ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుందని డిప్యూటీ ఆర్ఎం బాబునాయక్ అన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపికైన ఉద్యోగులను సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

అచ్చంపేట రూరల్: మండలంలోని లింగోటం తండాలోని బలరాంనాయక్‌కు చెందిన గేదె పొలం వద్ద గడ్డి మేస్తూ.. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. విద్యుత్‌శాఖ అధికారులకు విషయం చెప్పడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని పరిశీలించారు. తనను ఆదుకోవాలని రైతు వేడుకుంటున్నాడు.

జిల్లా కోర్టు పరిశీలన

కల్వకుర్తి టౌన్: కల్వకుర్తి సీనియర్ సివిల్ కోర్టును జిల్లా జడ్జి రాజేష్‌బాబు పరిశీలించారు. గురువారం కోర్టుకు వచ్చిన జడ్జి కోర్టు ప్రాంగణంలోని భవనంలో పైకప్పు నుంచి నీరు వస్తుందని కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదుతో వాటన్నింటిని పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రికార్డు రూంలోని ఫైళ్లు తడిసిపోతున్నాయని న్యాయవాదులు జడ్జి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే విషయాన్ని హైకోర్టు అధికారులకు నివేదిస్తానని జిల్లా జడ్జి తెలియజేశారు.

ఎమ్మెల్యేకు వినతి..

కల్వకుర్తి బార్ అసోసియేషన్ సభ్యులు హైదరాబాద్‌లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిసి కోర్టుకు నూతన భవనం నిర్మాణం చేపట్టేలా చొరవ చూపాలని వినతి అందజేశారు. కావ్య, బార్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి



నాగర్‌కర్నూల్ రూరల్: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం సహాయ కార్యదర్శి వార్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. విద్యా సంఘాల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ మతోన్మాద కుట్రలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అక్కడి ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్, ఇందిరమ్మ, కుర్వమ్మ, కృష్ణాజీ, బాలమురళీ, తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే మాయమాటలు

అచ్చంపేట రూరల్: మరోసారి నల్లమల ప్రాంత ప్రజలకు మాయ మాటలు చెప్పి ఓట్లు దండుకుని గద్దెనెక్కాలని ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు చూస్తున్నారని, ఈసారి నల్లమల ప్రజలు మోసపోరని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. పూటకో లిఫ్ట్ ఇరిగేషన్ పేరు చెప్పి పబ్బం గడుపుతున్నారే తప్పా ఉమామహేశ్వర, లక్ష్మీచెన్నకేశవ ప్రాజెక్టు పనులు ప్రారంభించడం లేదన్నారు. ఓట్ల కోసం నీళ్ల డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రాజెక్టుకు తాము వ్యతిరేకం కాదన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన అనుమతి పత్రం తీసుకొస్తే తామే మొదట సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇళ్లలో అవినీతి చేసినట్లు నిరూపిస్తే ఎన్నికల్లో పోటీ చేయనన్నారు. గువ్వల బాలరాజు అవినీతి అక్రమాలు చేసినట్లు తాను నిరూపిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వై.శ్రీనివాసులు, గోపాల్‌రెడ్డి, రాములు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకోవడానికి పనిచేస్తా..

ఉప్పునుంతల: నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవడానికి కంకణబద్ధుడనై పనిచేస్తానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. గురువారం మండల సరిహద్దులోని దుందుబీ వాగులో ఆయన కాజ్‌వే రోడ్డును పరిశీలించారు. ఎగువ నుంచి నీటి ప్రవాహం ప్రారంభం కావడంతో కాజ్‌వే రోడ్డు వద్ద పరిసర గ్రామాల రైతులు చేపలు పట్టడాన్ని ఎమ్మెల్యే కొంత సేపు వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఉప్పునుంతల, వంగూరు మండలాల ప్రజల చిరకాల వాంఛ మొల్గర వద్ద దుందుభీ వాగుపై హైలేవల్ బ్రిడ్జి నిర్మాణానికి మూడు రోజులు కిందటే రూ.35 కోట్లు సీఎం కేసీఆర్‌తో మంజూరు చేయించామన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి సర్వే పనులు ప్రారంభమయ్యాయన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాతనే నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి జరిగిందన్నారు. రైతుల సంతోషాన్ని జీర్ణించుకోని రేవంత్ రెడ్డి ఉచిత కరెంట్‌పై కామెంట్ చేయడంతో రైతుల ఆగ్రహానికి గురవుతున్నాడని అన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం



ఉప్పునుంతలలో..

కల్వకుర్తి రూరల్: పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో మొహర్రం వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని పంజుగల, గుండూరు, లింగసానిపల్లి, రఘుపతిపేట, ఎల్లికల్, మార్చాల తదితర గ్రామాలతో పాటు పట్టణంలోని అన్ని పీర్ల చావిడిల వద్ద పీర్లను నిలబెట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పీర్లను ఊరేగించి పీర్లచావిడికి తరలించారు.

వెల్దండ/ ఉప్పునుంతల/ లింగాల: పీర్ల చావడి నుంచి పీర్లను గురువారం గ్రామంలోని ఇంటింట తిప్పారు. భక్తులు నైవేద్యం సమర్పించారు. ప్రతి ఏడాది మొహర్ర ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సర్పంచ్ గోరటి శ్రీనివాసులు, బంగారు, మల్లేష్‌యాదవ్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కమిటీల ఏర్పాటు



కార్వంగలో బూత్‌కమిటీ సభ్యులతో భాస్కర్‌రెడ్డి

తెలకపల్లి: పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సింగిల్ విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కార్వంగలో బీఆర్ఎస్ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికలకు పార్టీని బలోపేతం చేయాలని కార్యకర్తలకు సూచించారు. కాశన్న, భాస్కర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీలు

అమ్రాబాద్: జాతీయ ఉపాధిహామీ పథకం చేపట్టిన పనులకు గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నారు. 2021 మార్చి నుంచి 2023 వరకు జరిగిన పనులు, ఖర్చు చేసిన రూ.8 కోట్లకు సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 20 గ్రామ పంచాయతీలు ఉండగా.. మొదటి విడతగా పది గ్రామపంచాయతీల్లో ఎస్ఆర్‌పీ, పది మంది డీఆర్‌పీలతో పాటు వీఎస్ఏలు తనిఖీల్లో పాల్గొంటున్నారు. రెండో విడత మిగిలిన గ్రామపంచాతీల తనిఖీల అనంతరం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు వివరించారు.

సమస్యలు పరిష్కరించకుంటే ప్రగతి భవన్ ముట్టడిస్తాం..



కల్వకుర్తి నుంచి జిల్లా కేంద్రానికి తరలి వెళ్తున్న పంచాయతీ కార్మికులు



జిల్లా కేంద్రంలో వినతి అందజేస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తా నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు గ్రామపంచాయతీ కార్మికులు పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ మాట్లాడారు. 22 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల నిరసనపై ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. ఇప్పటికైనా పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దేశ్యనాయక్, సీఐటీయూ జిల్లా నాయకులు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు వర్దం పర్వతాలు, పాదిల రామయ్య, ఈశ్వర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా కేంద్రంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడికి పంచాయతీ కార్మికులు మండల కేంద్రాల నుంచి తరలివెళ్లారు.